సాక్షి
సంగారెడ్డి
సోమవారం । 17 । ఫిబ్రవరి । 2025



ఆపద్బాంధవులు!

రక్తదానం చేస్తూ యువకులు ఎంతో మంది ప్రాణాలు కాపాడుతున్నారు.

వివరాలు 8లో ▸



భయం వీడు.. విజయం తోడు

విద్యార్థులు ధైర్యంగా ప్రణాళికతో ముందుకు సాగితే విజయం మీ సొంతం అవుతుంది.

వివరాలు 8లో ▸



క్రీడా మైదానాలు లేక అవస్థలు!

క్రీడామైదానాలు లేక యువత ఆటలకు దూరమవుతున్నారు.

వివరాలు 9లో ▸

24 నుంచి హరీశ్ పాదయాత్ర!

బసవేశ్వర కోసం బోరంచ నుంచి ఖేడ్ వరకు..

- సంగమేశ్వర కోసం మార్చి 1న కేతకీ ఆలయం నుంచి జహీరాబాద్ వరకు
- పథకాలను సాధనే లక్ష్యంగా..
- ఇప్పటికే పార్టీ నేతలతో సమావేశం



సంగమేశ్వర లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి సంబంధించి కంకోల్ వద్ద సంప్‌హౌస్‌కు భూమిపూజ చేస్తున్న అప్పటి నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు(ఫైల్)

జహీరాబాద్: గత బీఆర్ఎస్ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి సాగునీటిని అందించి బీడు భూములను సస్యశ్యామలం చేసేందుకు వీలుగా మంజూరు చేసిన సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల పథకాలను సాధించేందుకు మాజీమంత్రి హరీశ్‌రావు పాదయాత్రకు సిద్ధమవుతున్నారు. ఇందుకోసం పార్టీ నేతలు రూట్ మ్యాప్, తేదీలను ఖరారు చేశారు. ఈ విషయాన్ని పార్టీ నేతలు ధ్రువీకరించారు. ఆయా పథకాల పనులు ప్రారంభించే విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోందని, పాదయాత్ర ద్వారా వాటిని సాధించుకోవడమే లక్ష్యంగా హరీశ్‌రావు పాదయాత్ర చేపట్టాలని నిర్ణయించారు. నారాయణఖేడ్ నియోజకవర్గానికి సాగునీటిని అందించేందుకు వీలుగా బసవేశ్వర పథకానికి అప్పట్లో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ భూమిపూజ చేశారు. ఈ పథకాన్ని సాధించేందుకు గాను ఈనెల 24న బోరంచ లోని పోచమ్మ దేవాలయంలో పూజలు నిర్వహించి అక్కడి నుంచి నారాయణఖేడ్ వరకు సుమారు 15 కిలోమీటర్లు పాదయాత్ర నిర్వహించనున్నారు.

మూడు నియోజకవర్గాలకు సాగునీటికోసం...

జహీరాబాద్, సంగారెడ్డి, అందోల్ నియోజకవర్గాలకు సాగు నీటిని అందించేందుకు వీలుగా సంగమేశ్వర ఎత్తిపోతల పథకాన్ని చేపట్టారు. ఈ పథకాన్ని సాధించేందుకు వీలుగా మండల కేంద్రమైన ఝరాసంగంలోని శ్రీ కేతకీ సంగమేశ్వర ఆలయంలో హరీశ్‌రావు ప్రత్యేక పూజలు నిర్వహించి అక్కడి నుంచి 15 కిలోమీటర్లు పాదయాత్ర ద్వారా జహీరాబాద్ చేరుకుంటారు. పాదయాత్ర అనంతరం ఆయా నియోజకవర్గం కేంద్రాల్లో బహిరంగ సభ నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. 2021లో ఆయా ప్రాజెక్టులకు అనుమతులు లభించాయి. 21 ఫిబ్రవరి 2022లో నారాయణఖేడ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అప్పటి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల పథకాలకు శంకుస్థాపన చేశారు. ఆయా పథకాలకు గాను రూ.4,500 కోట్లు అవసరం అవుతాయని అంచనా వేశారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన కొండపోచమ్మ రిజర్వాయర్ నుంచి సింగూరుకు నీటిని మళ్లించి 20 టీఎంసీల వినియోగంతో 3.84లక్షల ఎకరాలకు సాగు నీరు అందించేందుకు రెండు ఎత్తిపోతల పథకాలను గత ప్రభుత్వం చేపట్టింది. సంగమేశ్వర ఎత్తిపోతల పథకానికి గాను 6,293 ఎకరాల భూమి అవసరం అవుతుందని, రూ.2,653 కోట్ల మేర నిధులు అవసరం అవుతాయని అంచనా వేశారు.

115 గ్రామాల్లో 1,03,259 ఎకరాలకు...

జహీరాబాద్, అందోల్, సంగారెడ్డి నియోజకవర్గాల్లోని 11 మండలాలకు చెందిన 231 గ్రామాల్లోని 2.19లక్షల ఎకరాలకు సాగు నీటిని అందించేందుకు ఈ పథకాన్ని రూపొందించారు. జహీరాబాద్ నియోజకవర్గంలోని 5 మండలాల పరిధిలోని 115 గ్రామాల్లో 1,03,259 ఎకరాలకు సాగు నీటిని అందించాలని ప్రతిపాదించారు. అందోల్ నియోజకవర్గంలోని రెండు మండలాల పరిధిలో 66 గ్రామాలకు చెందిన 65,816 ఎకరాలకు, సంగారెడ్డి నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలో 50 గ్రామాల్లోని 49,925 ఎకరాలకు సాగు నీరందించాలని నిర్ణయించారు. ఇందు కోసం 12 టీఎంసీల నీటిని ఉపయోగించుకోవాలని నిర్ణయించారు. నారాయణఖేడ్ నియోజకవర్గానికి సాగు నీటిని అందించేందుకు గాను బసవేశ్వర ఎత్తిపోతల పథకాన్ని చేపట్టారు. ఈ పథకం కింద 8 టీఎంసీల నీటితో 1,65లక్షల ఎకరాలకు నీటిని అందించాలని ప్రతిపాదించారు. ఇందు కోసం రూ.1,774కోట్లు అవసరం అవుతాయని అంచనా వేశారు.14 జూన్ 2021లో సంగమేశ్వర లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి సంబంధించి అందోల్ నియోజకవర్గంలోని కంకోల్‌లో సంప్‌హౌజ్, 21 జూన్ బసవేశ్వర లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి సంబంధించిన సంప్‌హౌస్ నిర్మాణానికి, అప్పటి నీటిపారుదల శాఖ మంత్రి టి.హరీశ్‌రావు శంకుస్థాపన చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ఆయా పథకాలకు గ్రహణం పట్టింది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆయా ప్రాజెక్టుల విషయంలో ఇటీవల ఎర్రవల్లిలోని తన ఫాంహౌస్‌లో జహీరాబాద్ ప్రాంత నేతల సమావేశంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించిన విషయం తెలిసిందే. అవసరం అయితే ఉద్యమాన్ని చేపట్టి ఆయా ప్రాజెక్టులను సాధిస్తానని ప్రభుత్వానికి హెచ్చరిక సైతం జారీ చేశారు.

స్థానిక నేతలతో హరీశ్‌రావు భేటీ

సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల పథకాలను ముందుకు తీసుకెళ్లే విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోందని హరీశ్‌రావు విమర్శించారు. ఈనెల 14న హైదరాబాద్‌లో ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు కె.మాణిక్‌రావు, చింతా ప్రభాకర్, సునీతారెడ్డి, మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ ఎం.శివకుమార్‌లతో సమావేశమయ్యారు. ఈ ప్రాజెక్టులపై ప్రభుత్వం కావాలని తాత్సారం చేస్తోందని ఆరోపించారు. పాదయాత్ర చేపట్టేందుకు గాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.



ప్రచారం నిర్వహిస్తున్న బీబీపాటిల్

ఎంపీ బీబీ పాటిల్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

జహీరాబాద్ టౌన్: పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి గెలిపించాలని కోరుతూ మాజీ ఎంపీ. బీబీపాటిల్ ఆదివారం జహీరాబాద్ పట్టణంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి పట్టభద్రులను కలిశారు. ప్రజా సమస్యలపై బీజేపీ పోరాటం చేస్తుందని, అందువల్ల బీజేపీ బలపరిచిన అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఆయన వెంట బీజేపీ నియోజకవర్గం కన్వీనర్ జగన్నాథ్, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, గొల్ల భాస్కర్, సుధీర్ బండారీ, మల్లికార్జున్ పాటిల్, శోభారాణి తదితరులు ఉన్నారు.

మల్లన్న జాతరకు రండి

చేగుంట(తూప్రాన్): మండలంలోని ఇబ్రహీంపూర్ మల్లన్న జాతరకు రావాలని కోరుతూ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు హైదరాబాద్‌లో ఆదివారం నాయకులు ఆహ్వానపత్రిక అందజేశారు. ఈనెల 23న భ్రమరాంబ సహిత మల్లికార్జునస్వామి సప్తమ వార్షికోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు నవీన్, ఉత్సవ కమిటీ సభ్యులు ఉన్నారు.

న్యూస్‌రీల్

రూ.1.72 లక్షల ఆస్తి పన్ను వసూలు



మున్సిపల్ అధికారులకు చెక్కులు అందజేస్తున్న పరిశ్రమ ప్రతినిధులు

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీలో ఆస్తి పన్ను వసూళ్ల ప్రక్రియ వేగంగా కొనసాగుతుందని కమిషనర్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. పారిశ్రామికవాడలోని జెనెక్స్ లేబొరేటరీ పారిశ్రామికవేత్తలు రూ.1.72లక్షలను చెక్కు రూపంలో మున్సిపల్ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ...జిల్లా అదనపు కలెక్టర్ ఆదేశాల మేరకు బృందాలను ఏర్పాటు చేసి స్పెషల్ డ్రైవ్ చేపట్టామన్నారు. ఆస్తి పన్ను చెల్లింపుల్లో నిర్లక్ష్యంగా ఉన్నట్లయితే నోటీసులు అందించి ఆస్తులు జప్తు చేస్తామని హెచ్చరించారు. ఏప్రిల్ నెల ఆరంభానికి ముందే ఆస్తి పన్ను చెల్లించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆర్వో నర్సింలు, వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు రఘురాం రెడ్డి, అలీ, సునీత, తదితరులు పాల్గొన్నారు.

పొగాకు ఆరోగ్యానికి హానికరం: విష్ణువర్ధన్‌రెడ్డి



ప్రచారం చేస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

నారాయణఖేడ్: పొగాకు ఉత్పత్తుల వినియోగం ఆరోగ్యానికి హానికరమని జిల్లా పొగాకు నియంత్రణ విభాగం సూపర్‌వైజర్ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమంలో భాగంగా ఖేడ్‌లోని రాజీవ్‌చౌక్, బసవేశ్వర చౌక్, బస్టాండ్ ప్రాంతాల్లో ఆదివారం ప్రచారం నిర్వహించారు. పొగాకు ఉత్పత్తులైన బీడీ, చుట్ట, సిగరెట్, జరదా, తంబాకు, పాన్‌మసాలా లాంటివి వినియోగించకూడదని సూచించారు. వాటి వాడకం వల్ల హైపర్‌టెన్షన్, నోటి క్యాన్సర్, శ్వాసకోశ, గుండె సంబంధిత వ్యాధులు సంక్రమించే అవకాశం ఉందన్నారు. బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేయడం సెక్షన్ 4 ప్రకారం నేరం అని అందుకు రూ.200 జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

ఐఎంఏ నూతన కార్యవర్గం ఎన్నిక



నూతనంగా ఎన్నికైన ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కార్యవర్గం

సంగారెడ్డి: సంగారెడ్డి జిల్లా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) నూతన కార్యవర్గం ఎన్నికైంది. సంగారెడ్డిలో ఆదివారం తెలంగాణ రాష్ట్ర ఐఎంఏ కార్యవర్గ సభ్యుల సమక్షంలో ఎన్నికలను నిర్వహించారు. అధ్యక్షుడిగా కిరణ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా ఆనంద్, ఉపాధ్యక్షులుగా చంద్రశేఖర్, ఉష, సంయుక్త కార్యదర్శులుగా సురేశ్ కుమార్, జ్యోతి, హరినాథ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్య వర్గం సభ్యులు మాట్లాడుతూ... సంగారెడ్డి కొత్త కార్యవర్గం సభ్యత్వం పెంపుదల చేస్తామన్నారు. ఉచిత వైద్య శిబిరాలు, నైతిక వైద్య ప్రవర్తన ప్రోత్సాహం, ప్రజారోగ్య అవగాహన కార్యక్రమాలు, ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంగారెడ్డి సీనియర్ వైద్యులు శ్రీహరి, విజయనిర్మల, శ్రీధర్,వెంకట్, స్వామిదాస్, రహీమ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

తపస్ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమరయ్య

జహీరాబాద్: ఎమ్మెల్సీగా తనను గెలిపిస్తే ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని తపస్ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమరయ్య అన్నారు. జహీరాబాద్‌లోని అతిథి బ్యాంకెట్‌హాల్‌లో ఆదివారం నిర్వహించిన ఉపాధ్యాయుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కరీంనగర్–మెదక్–నిజామాబాద్–ఆదిలాబాద్ టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నానన్నారు. ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. సీపీఎస్‌రద్దు–పాత పెన్షన్ విధానం పునరుద్ధరణకుగాను ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తానని హామీనిచ్చారు. సమావేశంలో తపస్ జిల్లా అధ్యక్షుడు దత్తాత్రి, రాష్ట్ర కార్యదర్శి బస్వరాజ్, నర్సింహారెడ్డిలతోపాటు ఆయా మండలాల బాధ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ట్రాఫికర్

సంగారెడ్డి, జహీరాబాద్‌లో పెరిగిన వాహనాల రద్దీ

- ట్రాఫిక్ రూల్స్ పాటించని వాహనదారులు
- నిబంధనల ఉల్లంఘనలతో తరచూ రోడ్డు ప్రమాదాలు
- తనిఖీలు చేస్తున్నా తీరుమారని వైనం
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు



జహీరాబాద్‌లో రోడ్డు పక్కనే నిలిపిన బైక్‌లు



వాహనాల తనిఖీలు చేపడుతున్న పోలీసులు

సంగారెడ్డి క్రైమ్/జహీరాబాద్ టౌన్: సంగారెడ్డి, జహీరాబాద్‌లలో వాహనదారులకు ట్రాఫిక్ కష్టాలు ఎక్కువయ్యాయి. ట్రాఫిక్ నియమాలు పాటించకపోవడం, నిర్లక్ష్యంగా, వేగంగా డ్రైవింగ్ చేయడం, కొన్నిచోట్ల ట్రాఫిక్ సిగ్నళ్ల వద్ద లైట్లు సరిగ్గా పనిచేయకపోవడం, కొన్ని కూడళ్ల వద్ద అక్రమపార్కింగ్, దుకాణాలు, తోపుడు బళ్ల రద్దీ వంటి అంశాలు వాహనదారులను ప్రమాదాల బారిన పడేస్తున్నాయి. పోలీసులు నిత్యం తనిఖీలు నిర్వహిస్తూ కేసులు నమోదు చేసి జరిమానాలు విధిస్తున్నా వాహనదారుల వైఖరిలో మార్పు రావడంలేదు.

సంగారెడ్డిలో....

సంగారెడ్డిలో ద్విచక్ర వాహనదారులు రోడ్డు భద్రత నియమ నిబంధనలు పాటించడం లేదు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకుండా, ఇద్దరు లేదా ముగ్గురు ఒకే వాహనంపై ప్రయాణిస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. నిబంధనలు పాటించని వారిలో ఎక్కువమంది ఉన్నత చదువులు చదువుకున్న వారే ఉండటం శోచనీయం. పాత, కొత్త బస్టాండ్‌ల నుంచి స్థానిక ఐబీ వరకు, బైపాస్ రోడ్ మార్గంలో, ఉదయం సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ రద్దీగా ఉంటోంది. కొంతమంది యువకులు ద్విచక్ర వాహనాలపై ఇష్టారాజ్యంగా ప్రయాణిస్తున్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ, ఇతరులకు ఇబ్బంది కలిగించేలా ర్యాష్ డ్రైవింగ్ చేయడం వంటివి చేస్తున్నారు. ఈ క్రమంలో ఎదురుగా వచ్చే వాహనాన్ని గమనించకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికైనా ట్రాఫిక్ పోలీసులు ఆకతాయిలపై చర్యలు తీసుకుని రోడ్డు ప్రమాదాలను నివారించాలని స్థానికులు కోరుతున్నారు.


జహీరాబాద్‌లో...

జహీరాబాద్‌లో ట్రాఫిక్ సమస్యతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం జనసంచారం, వాహనాల రాకపోకల వల్ల రద్దీ పెరిగింది. ఫుట్‌పాత్‌ల మీద టిఫిన్ సెంటర్లు, తోపుడు బండ్లు, చిరు వ్యాపారులు దుకాణాలు పెడుతుండటంతో రోడ్లు ఇరుకుగా మారిపోతున్నాయి. దీంతో ట్రాఫిక్ సమస్య ప్రజలకు తలనొప్పిగా తయారైంది. కుమార్ హోటల్ నుంచి లైఫ్‌స్టయిల్ కాంప్లెక్స్ వరకు రోడ్డుకు ఇరువైపులా ట్రాఫిక్ తీవ్రంగా ఉంటోంది. ఒకవైపు వాహనాలను రాంగ్ పార్కింగ్, మరోవైపు వ్యాపారులు అక్రమణలకు పాల్పడటం వల్ల ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు.

సరిగ్గా పనిచేయని సిగ్నల్ లైట్లు

ట్రాఫిక్ నియంత్రణ కోసం భవానీ మందిర చౌరస్తా, బస్టాండ్ ముందు, పస్తాపూర్ చౌరస్తాతో పాటు బాగారెడ్డి విగ్రహం వద్ద ప్రధాన చౌరస్తాలో ఏర్పాటు చేసిన సిగ్నల్ లైట్లు ఒక్కోసారి సరిగ్గా పని చేయడం లేదు. సాంకేతిక లోపంగానో లేదా మరే ఇతర కారణమో తెలియదుకానీ అప్పుడప్పుడూ ఆ లైట్లు పనిచేయడం లేదు. దీంతో ఏ వాహనం ఎటు వెళ్తుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. పోలీసులు, మున్సిపల్ అధికారులు స్పందించి ట్రాఫిక్ సమస్యను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

మైనర్లకు వాహనాలిస్తే తల్లిదండ్రులపై కేసులు



నిర్లక్ష్యపు డ్రైవింగ్‌తో తమ ప్రాణాలతోపాటు ఇతరుల ప్రాణాలకు హాని కలిగిస్తున్నారు. వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలి. మైనర్లకు వాహనాలిస్తే తల్లిదండ్రులపై కేసులు పెడతాం. –రమేశ్, సంగారెడ్డి సీఐ



రైల్వే ఓవర్‌బ్రిడ్జిపై కొనసాగుతున్న బీటీ రోడ్డు నిర్మాణం పనులు

రైల్వే ఓవర్‌బ్రిడ్జి పనుల్లో వేగం

- నెల రోజుల్లో పూర్తి
- రూ.90కోట్లతో నిర్మాణం
- ముమ్మరంగా సాగుతున్న బీటీ పనులు

జహీరాబాద్: పట్టణంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనుల్లో ఎట్టకేలకు వేగం పుంజుకుంది. బ్రిడ్జిపై బీటీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. నెల రోజుల్లో పనులన్నీ పూర్తి చేసుకుని ప్రారంభోత్సవానికి సిద్ధం కానుందని రోడ్లు భవనాల (ఆర్అండ్‌బీ) శాఖ అధికారులు చెబుతున్నారు. ప్రాజెక్టు అంచనా రూ.90కోట్లు కాగా, అందులో రూ.50 కోట్లు భూ సేకరణ కోసం కేటాయించారు. రూ.40 కోట్లతో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టారు. ఇప్పటి వరకు రూ.23కోట్ల మేర నిధులు విడుదలైనట్లు అధికారులు వివరించారు. బ్రిడ్జి పైభాగంలో ప్లాస్టరింగ్‌తోపాటు వైరింగ్, విద్యుత్ స్తంభాల బిగింపు వంటి ఎలక్ట్రిక్ ఫిక్సేషన్ పనులు చేపట్టాల్సి ఉంది. ఇందుకోసం అంచనాలతో ప్రతిపాదనలు పంపాల్సి ఉన్నట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి. బ్రిడ్జి నిర్మాణం కోసం 17వేల క్యూబిక్ మీటర్ల మట్టిని ఉపయోగించారు. మట్టికి సంబంధించి మైనింగ్ శాఖకు రాయల్టీ చెల్లించాల్సి ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. బ్రిడ్జి వద్ద నుంచి బీదర్ క్రాస్ రోడ్డు వరకు సీసీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి కాగా, డివైడర్ పనులు కొనసాగుతున్నాయి. నాణ్యత విషయంలో ఎక్కడా రాజీపడకుండా పనులు పర్యవేక్షిస్తున్నట్లు ఏఈఈ సంధ్య తెలిపారు. నెల రోజుల్లో పనులన్నీ పూర్తి అవుతాయని, ప్రారంభోత్సవానికి సిద్ధం చేయనున్నట్లు తెలిపారు.

ఆరేళ్లకు మోక్షం

రైల్వే ఓవర్‌బ్రిడ్జి చేపట్టిన ఆరేళ్లకు నిర్మాణ పనులు పూర్తి కావస్తున్నాయి. స్థానిక లెవెల్ క్రాసింగ్ మీదుగా హైదరాబాద్, సికింద్రాబాద్‌ల నుంచి నాందేడ్, పూర్ణ, షిర్డీ, పర్లీ, లాతూర్ ప్రాంతాలతోపాటు బెంగళూరు, తిరుపతి, కాకినాడ ప్రాంతాలకు ఎక్స్‌ప్రెస్ రైళ్ల రాకపోకలు సాగిస్తున్నాయి. అంతేకాకుండా గూడ్స్ రైళ్లు సైతం ఎక్కువగా వచ్చి పోతుంటాయి. నిత్యం ఎంతో రద్దీగా ఉండే ఈ మార్గంలో రైలు వచ్చిన ప్రతీసారి గేట్లు మూసివేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతూ వస్తున్నారు. పట్టణ ప్రజలతోపాటు అంతర్రాష్ట్ర రాకపోకలు సాగించే ప్రయాణికులు రైలు వచ్చిన ప్రతీసారి రైల్వే గేటు వద్ద కనీసం 20 నుంచి 30 నిమిషాల పాటు ఆగాల్సి వస్తోంది. కష్టాలను దూరం చేసేందుకు వీలుగా అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం 2018లో రూ.90కోట్లు మంజూరు చేయగా అదే ఏడాది ఆగస్టు 30న ఆర్అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో రైల్వే ఓవర్‌బ్రిడ్జి నిర్మాణం పనులు చేపట్టారు.

శాశ్వతంగా తీరనున్న కష్టాలు

రైల్వే ఓవర్‌బ్రిడ్జి నిర్మాణం పనులు పూర్తయ్యి వినియోగంలోకి వస్తే వాహన చోదకుల కష్టాలు శాశ్వతంగా తొలగనున్నాయి. జహీరాబాద్–పర్లీ తదితర ప్రాంతాలకు అనునిత్యం 36 రైళ్ల వరకు రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో తరచూ రైల్వేగేటు మూసి ఉంచడంతో ట్రాఫిక్ స్తంభించి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. సమయానికి గమ్యస్థానాలకు చేరుకోలేని పరిస్థితి ఉంది. బ్రిడ్జి పనులు పూర్తిచేసి వినియోగంలోకి వస్తే ప్రజలు, ప్రయాణికుల కష్టాలు శాశ్వతంగా తీరనున్నాయి.

పూర్తిస్థాయిలో రైతు భరోసా

ఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి డిమాండ్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: రైతు భరోసాను పూర్తిస్థాయిలో రైతులందరికీ అందించాలని ఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఇప్పటివరకు 3 ఎకరాల వరకు రైతుల ఖాతాల్లో నగదు జమచేశామని ప్రభుత్వం చెబుతున్నా 60 శాతం మందికి కూడా అందలేదన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ...నాగల్‌గిద్ద మండలంలో 13 వేల ఎకరాలకుగాను 8 వేల ఎకరాలకు మాత్రమే నగదు జమ చేశారన్నారు. శేరిదామరగిద్దలో గిరిజనులకు సంబంధించి 525 ఎకరాలున్నా ఒక ఎకరానికి కూడా డబ్బులు అందలేదన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఏమైనా సమస్యలు ఉంటే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరింపజేసేవాడినని, కానీ, ప్రస్తుతం ఇక్కడ కాంగ్రెస్‌కు చెందిన ఎంపీ, ఎమ్మెల్యే ఉన్నా రైతులను ఏమాత్రం పట్టించుకోవడంలేదని విమర్శించారు. రైతుల ఖాతాల్లో రైతుభరోసా డబ్బులను జమచేయాలని, లేనిపక్షంలో భారీ ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

నేడు రక్తదాన శిబిరం

మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు జన్మదినాన్ని పురస్కరించుకుని మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 11 గంటలకు ఖేడ్ ప్రాంతీయ ఆసుపత్రిలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు ఖేడ్ బీఆర్ఎస్ కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. బీఆర్ఎస్, అనుబంధ సంఘాల బాధ్యులు, నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరింది.

ఇంటర్ విద్యార్థులకు మరోసారి అవకాశం



సంగారెడ్డి ఎడ్యుకేషన్: ఇటీవలే ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్ పరీక్షలకు గైర్హాజరైన జనరల్, ఒకేషనల్ విద్యార్థులకు విద్యాశాఖ మరోసారి అవకాశం కల్పిస్తున్నట్లు ఇంటర్మీడియెట్ జిల్లా అధికారి గోవిందరాం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ప్రాక్టికల్ పరీక్షలు ఈ నెల 18 నుంచి 22వ తేదీ వరకు జరుగనున్నాయని తెలిపారు. ఈ పరీక్షలు సంగారెడ్డిలోని బాలుర జూనియర్ కళాశాలలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయన్నారు. గైర్హాజరైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



బైక్ ర్యాలీతో నిరసన

డంపింగ్‌యార్డ్‌పై నిరసనల వెల్లువ

మద్దతిచ్చిన నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీ పారానగర్ డంపింగ్ యార్డ్ ఏర్పాటు వ్యతిరేక ఆందోళన కార్యక్రమాలు 12వ రోజుకు చేరుకున్నాయి. మండలంలోని గ్రామ గ్రామాల్లో సర్వత్రా నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. నిరసన ర్యాలీలు, రిలే నిరాహార దీక్షల కార్యక్రమాలకు నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి హాజరై మద్దతు తెలిపారు. డంపింగ్‌యార్డ్ ఏర్పాటు చేయాలని చూస్తే ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని ఆమె ఈ సందర్భంగా హెచ్చరించారు. నిరసన కార్యక్రమాల్లో భాగంగా గుమ్మడిదల నుంచి అన్నారం వరకు ఆందోళనకారులు బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జేఏసీ సభ్యులు రైతులు మహిళలు యువకులు, పాల్గొన్నారు.

క్లుప్తంగా

తండ్రి మృతిపై అనుమానం


గోపాల్

పటాన్‌చెరు టౌన్: తండ్రి మృతిపై అనుమానం ఉందని కుమారుడు ఫిర్యాదు చేసిన సంఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మెదక్ జిల్లా పాపన్నపేట్ మండలం లింగాయపల్లి సొమ్ల తండాకు చెందిన బానోత్ గోపాల్ 10 సంవత్సరాల క్రితం భార్య లక్ష్మి, పిల్లలతో కలిసి అమీన్‌పూర్‌కు వచ్చి కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో 14 రాత్రి గోపాల్ చెత్త పడేసి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు గోపాల్ కోసం స్థానికంగా వెతుకుతుండగా 15వ తేదీ సాయంత్రం అమీన్‌పూర్ గ్రేవీ యార్డ్ వెనుక ఉన్న రాళ్లలో గోపాల్ మృతదేహం కనిపించింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తండ్రి మృతిపై అనుమానం ఉందని కుమారుడు బానోత్ సుధీర్ ఆదివారం ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అగ్ని ప్రమాదంలో గడ్డివాము, స్ప్రింక్లర్లు దగ్ధం



బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి శివారులోని డబుల్ బెడ్రూం ఇళ్ల సమీపంలో ఆదివారం ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం సంభవించింది. వ్యవసాయ భూములలో ఎలాంటి పంటలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. మండలంలోని పోతారం శివారు వరకు వ్యవసాయ భూములలో మంటలు వ్యాపించి కట్కూరు శంకర్‌కు చెందిన గడ్డివాము దగ్ధమైంది. ప్రశాంత్‌కు చెందిన ఆయిల్ పామ్ చెట్లు, స్ప్రింక్లర్ పైపులు దగ్ధమయ్యాయి. సకాలంలో రైతులు మంటలను ఆర్పివేశారు.

వ్యక్తిపై కేసు నమోదు

సిద్దిపేటరూరల్: మెడలో నుంచి బంగారు గొలుసు తస్కరించేందుకు యత్నించిన గుర్తు తెలియని వ్యక్తిపై కేసు నమోదైంది. ఈ ఘటన పోలిస్‌స్టేషన్ పరిధిలోని ఆదివారం చోటు చేసుకుంది. చిన్నగుండవెల్లికి చెందిన మంద శంకరవ్వ ఆదివారం తన వ్యవసాయ భావి వద్దకు వెళ్లి మధ్యాహ్నం సమయంలో ఇంటికి వెళ్తోంది. ఈ క్రమంలో శంకరవ్వకు ఎదురుగా గ్రామం నుంచి బైక్‌పై వస్తున్న గుర్తు తెలియని వ్యక్తి సిద్దిపేటకు ఎలా వెళ్ళాలి అని అడగడంతో వివరాలు చెప్పింది. దీంతో వెళ్లిపోయినట్లు నటించిన వ్యక్తి మళ్లీ శంకరవ్వ వద్దకు వచ్చి మెడలో ఉన్న 3 తులాల బంగారు గొలుసుని లాక్కునే ప్రయత్నం చేశాడు. దీంతో గట్టిగా అరవడంతో అటుగా వెళ్తున్న గ్రామస్తులు అక్కడికి వచ్చారు. గమనించిన దొంగ బైక్‌పై పారిపోయాడని తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అపూర్వరెడ్డి తెలిపారు.

నూరేళ్ల వృద్ధుడు మృతి

జహీరాబాద్ టౌన్: మండలంలోని అల్గోల్ గ్రామంలో నూరేళ్ల వయస్సు ఉన్న వృద్ధుడు మృతి చెందాడు. సి. పెంటారెడ్డి(100) భార్య నలుగురు సంతానం. ముగ్గురు ఆడపిల్లలు ఒక కొడుకు. కుమారుడు మృతి చెందగా కోడలు మనవళ్లు హైదరాబాద్‌లో ఉంటున్నారు. ఆయనకు ఉర్దూ, తెలుగు భాషలపై మంచి పట్టు ఉంది. గ్రామస్తులతో స్నేహపూర్వకంగా ఉంటూ దేశ స్వాతంత్య్రం, నిజాంరాజు గురించి ప్రజలకు వివరించే వారు. రోడ్డుపై వెళ్తున్న సమయంలో అదుపుతప్పి కిందపడ్డాడు. అప్పటి నుంచి మంచం పట్టి మృతి చెందాడు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ రెగ్యులర్ & డిస్టెన్స్: డిగ్రీ, PG, బి.టెక్, ఫార్మసీ, GNM, నర్సింగ్, B.Ed, B.P.Ed, MBA, P.hd, ఓపెన్ టెన్త్ & ఇంటర్ (4 నెలల్లో పూర్తి) Dr.J.S. అకాడమీ (ISO సర్టిఫైడ్) 8866977112 [HA-15389]

SERVICES

BUSINESS SERVICES

■ మీ బంగారం మణప్పురం, ముత్తూట్, మార్వాడీ షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్నా మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. 9160077916 స్పాట్ క్యాష్ [HA-783070]

■ మీ బంగారం మణప్పురం, ముత్తూట్, మార్వాడీ షాప్ ఏ ఫైనాన్స్‌లో ఉన్న మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. 9177555694 స్పాట్ క్యాష్ [SCA25001685]

WANTED

■ త్రివేణి హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను చూసుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ : 18K. Ph: 9160900024, 9640400073 [SCA25001686]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రత్యుత్తరించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఆపద్బాంధవులు!

- అత్యవసర సమయాల్లో రక్తదానం చేస్తున్న యువత
- ఐదు వందల మంది సభ్యులు.. రెండు వేల మందికి రక్తదానం
- ఆదర్శంగా నిలుస్తున్న సంగారెడ్డి బ్లడ్ డోనర్స్ క్లబ్



రక్తదానం చేస్తున్న సంగారెడ్డి బ్లడ్ డోనార్స్ సభ్యులు(ఫైల్)

సంగారెడ్డి రూరల్: మానవ సేవే మాధవ సేవ అన్న సూక్తిని ఆదర్శంగా తీసుకుని రక్తదానం చేస్తూ ఎంతో మంది ప్రాణాలు కాపాడుతున్నారు ఆ యువకులు. వాట్సాప్‌లో ఓ గ్రూపును ఏర్పాటు చేసుకుని ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు సంగారెడ్డి బ్లడ్ డోనర్స్ క్లబ్ సభ్యులు. సంగారెడ్డి పట్టణానికి చెందిన జనజాగృతి స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు బంగారు కృష్ణ సంగారెడ్డి బ్లడ్ డోనర్స్ క్లబ్‌ను 2019లో ప్రారంభించారు.

పన్నెండు మందితో ప్రారంభించిన ఈ క్లబ్‌లో ప్రస్తుతం 500 మందికి పైగా బ్లడ్ డోనర్లు ఉన్నారు. ఎవరికైనా రక్తం అత్యవసరమైతే ఈ వాట్సాప్ గ్రూపులో పోస్టు చేస్తే చాలు అందుబాటులో ఉన్న వారు వచ్చి రక్తదానం చేస్తున్నారు. ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడుతున్నారు. ఇలా సుమారు ఆరు సంవత్సరాలుగా ఈ సేవ చేస్తున్నారు.

రక్తం ఎంతో విలువైనది.

ఒక యూనిట్ రక్తంతో ఒకరి ప్రాణాలు కాపాడచ్చు. ప్రమాదంలో గాయపడ్డ వారికి, గర్భిణులకు రక్తం ఎంతో అవసరం. క్లిష్ట పరిస్థితుల్లో ఆయా గ్రూప్ రక్తం అందుబాటులో లేకపోతే ప్రాణాలే పోగొట్టుకునే పరిస్థితి ఉంటుంది. అలాంటి సమయంలో మేమున్నామంటూ బ్లడ్ డోనర్స్ క్లబ్ యువత ముందుకొచ్చి రక్తదానం చేస్తూ ప్రాణాలను నిలబెడుతోంది.

ప్లాస్మాదానం కూడా..

కరోనా మహమ్మారి అనేక మంది ప్రాణాలను బలితీసుకుంటున్న రోజుల్లో కూడా డోనర్స్ క్లబ్ సభ్యులు రక్తదానం చేశారు. ఈ వైరస్ బారిన పడి ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి ప్లాస్మాదానం చేసి ఎంతో మంది ప్రాణాలు కాపాడారు.

అపోహలు వద్దు..



కొందరు రక్తం ఇస్తే అనారోగ్యం పాలవుతా రని అనుమానాలు పెట్టు కుంటారు. ఇవన్నీ అపోహలు మాత్రమే. ఆరోగ్యంగా ఉన్న వ్యక్తి నాలుగు నెలలకు ఒకసారి బ్లడ్ డొనేట్ చేయవచ్చు. డొనేట్ చేసిన వెంటనే బ్లడ్ ఉత్పత్తి అవుతుంది. ఏలాంటి వ్యాధులు, అనారోగ్య సమస్యలు ఉండవు.

-డాక్టర్ అనిల్‌కుమార్, ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్

నేనూ ఇస్తూ.. ఇతరులతో ఇప్పిస్తాను



నా మిత్రుడు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. అప్పుడు అత్యవసర సమయంలో ఎవరిని అడిగిన రక్తం ఇచ్చేందుకు ముందుకు రాలేదు. ఇలాంటి పరిస్థితి ఎవరికీ రావద్దని బ్లడ్ డోనర్స్ క్లబ్‌ను ప్రారంభించాను. రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేసి నేను రక్తం ఇవ్వడంతోపాటు, స్నేహితులతో రక్తదానం చేయిస్తుంటాను.

- బంగారు కృష్ణ, సంగారెడ్డి బ్లడ్ డోనర్స్ క్లబ్ అధ్యక్షుడు

ఆపద వస్తే.. వచ్చేస్తాడు



జోగిపేట ఆర్టీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ స్వచ్ఛందగా రక్తదానం చేస్తున్నాను అత్యవసరంలో ఎవరు ఫోన్ చేసిన లేదా గ్రూప్‌లో మెసేజ్ పెట్టిన నాకు సంబంధించిన బ్లడ్ అయితే వెళ్లి ఇస్తాను. వేరే గ్రూప్ ఏదైనా అయితే నా స్నేహితులతో ఇప్పిస్తాను. ఇప్పటివరకు ఇరవై సార్లు రక్తమిచ్చాను.

- కిషోర్, ప్రభుత్వ ఉద్యోగి

ఎనిమిది సార్లు రక్తమిచ్చాను



ఒక ప్రైవేట్ సంస్థలో పని చేస్తున్నాను. ఆపదలో ఉన్న వారికీ రక్తదానం చేస్తే సంతృప్తిగా ఉంటుంది. మా క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రతి రక్తదాన శిబిరంలో పాల్గొంటాను. నాతో పాటు కంపెనీలో పని చేసే వారితో కూడా రక్తదానం చేయిస్తుంటాను. ఇప్పటి వరకు 8 సార్లు బ్లడ్ డొనేట్ చేశాను.

-సాయికుమార్ పుల్‌కల్ మండలం, బస్వాపూర్

బోరు మోటారు వేసేందుకు వెళ్లి..

- ప్రమాదవశాత్తు బావిలో పడి రైతు మృతి
- తున్కిబొల్లారంలో ఘటన


యాదగిరి(ఫైల్)

ములుగు(గజ్వేల్): కౌలుకు తీసుకున్న పొలం వద్ద బోరు మోటారు వేసేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు బావిలో పడి కౌలు రైతు మృతి చెందిన ఘటన మండలం తున్కిబొల్లారంలో శనివారం చోటుచేసుకుంది. మృతుడు మామిడ్యాల ఆర్‌అండ్‌ఆర్ కాలనీ వాసి. ఎస్ఐ విజయ్‌కుమార్ కథనం ప్రకారం.. ఆర్ అండ్ ఆర్ కాలనీకి చెందిన బొమ్మ యాదగిరి(55)కి భార్య యాదమ్మ, కొడుకు నాగరాజు ఉన్నారు. పొరుగునే ఉన్న తున్కిబొల్లారంలో కొంత భూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేసుకుంటున్నాడు. శనివారం భార్య, కొడుకుతో కలసి పొలం వద్దకు వెళ్లిన యాదగిరి బోరు మోటారు వేసి వస్తానని చెప్పి బావివద్దకు వెళ్లాడు. అతను తిరిగి రాకపోవడంతో భార్య, కొడుకు పరిసర ప్రాంతాల్లో వెతికినప్పటికీ జాడ తెలియలేదు. బోరు బావి గడ్డమీద యాదగిరి తువాల కనపడటంతో అతను ప్రమాదవశాత్తు బావిలో పడి ఉంటాడని వెతికారు. బావిలో యాదగిరి మృతదేహం గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అతడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బ్యాంకుకు వెళ్తున్నట్లు చెప్పి..

మహిళ అదృశ్యం


యాదమ్మ(ఫైల్)

వర్గల్(గజ్వేల్): బ్యాంకులో డబ్బులు తీసుకునేందుకు వెళ్లిన మహిళ ఆచూకీ తెలియకుండా పోయింది. వర్గల్ మండలం అనంతగిరిపల్లిలో చోటుచేసుకున్న ఈ ఘటనపై ఆదివారం మిస్సింగ్ కేసు నమోదైంది. గౌరారం ఏఎస్ఐ పోచాగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. అనంతగిరిపల్లికి చెందిన దార యాదమ్మ(40) భర్త కొంతకాలం క్రితం మృతి చెందాడు. ఆమె కూలీ పని చేస్తున్నారు. శనివారం ఉదయం బ్యాంకులో డబ్బుల కోసం వెళ్తున్నట్లు చెప్పి ఇంటి నుంచి వెళ్లారు. ఆ తరువాత ఇంటికి తిరిగిరాలేదు. ఆమె కుమారుడు సాయికుమా ర్ తల్లి నంబర్‌కు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్‌లో ఉంది. దీంతో ఆందోళనకు గురై తల్లి జాడ కోసం అంతటా వెతికినప్పటికీ ఫలితం దక్కలేదు. ఆదివారం గౌరారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ పేర్కొన్నారు.

వ్యక్తి అదృశ్యం

శివ్వంపేట(నర్సాపూర్): వ్యక్తి కనిపించకుండా పోయిన సంఘటన ఆదివారం మండలంలోని తాళ్లపల్లిగడ్డ తండాలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. తండాకు చెందిన ధనావత్ రాంచందర్ ఈనెల 11న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని, అతని భార్య విజయ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డీసీఎంను ఢీకొట్టిన కారు, ఒకరి మృతి

నలుగురికి తీవ్ర గాయాలు


మృతుడు సురేశ్


డీసీఎంను ఢీకొట్టిన కారు

కొండపాక(గజ్వేల్): డీసీఎం వాహనాన్ని వెనుక నుంచి ఓ కారు ఢీ కొట్టడంతో ఒకరు మృతి చెందగా మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన మండలంలోని తిమ్మారెడ్డిపల్లి శివారులో ఆదివారం చోటు చేసుకుంది. కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్‌లోని జగద్గిరిగుట్ట(ప్రగతినగర్)లో ముగ్గురు అన్నదమ్ములు చంద వెంకటేశ్, భీమయ్య, సురేశ్ నివాసం ఉంటున్నారు. వారు సెంట్రింగ్ కాంట్రాక్టు పనులు చేసుకొంటూ జీవనం సాగిస్తుంటారు. ఈ నెల 13న భీమయ్య కుమారుడి వివాహం జరిగింది. కొమురంభీం జిల్లా కౌటులం గ్రామంలో వివాహ అనంతరం జరిగే కార్యక్రమం నిమిత్తం అన్నదమ్ముల కుటుంబ సభ్యులు, వారి బంధువులు వేర్వేరు కార్లలో ఆదివారం ఉదయం బయలు దేరారు. ఈ క్రమంలో మండలంలోని తిమ్మారెడ్డిపల్లి శివారులో రాజీవ్ రహదారి ప్రక్కన ముందు ఆగిన ఓ డీసీఎంను వెనుక నుంచి ఢీకొట్టారు. దీంతో కారు డ్రైవరు ప్రక్క సీట్లో కూర్చున్న చంద సురేశ్ అక్కడికక్కడే మృతి చెందగా మిగతా వారికి తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకొని అక్కడికి చేరిన పోలీసులు క్షతగాత్రులను అంబులెన్సులో సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సదాశివపేటకు చెందిన డీసీఎం డ్రైవరు మన్సూర్ అలీపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రమాదవశాత్తు డివైడర్‌ను...


మృతి చెందిన అశోక్‌పాటిల్

కంగ్టి(నారాయణఖేడ్): ప్రమాదవశాత్తు డివైడర్‌కు ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. కంగ్టి మండల కేంద్రంలో ఆదివారం చోటుచేసుకున్న ఈ ప్రమాద ఘటన వివరాలిలా ఉన్నాయి. మహారాష్ట్రలోని దెగ్లూర్ తాలుకా భూతన్‌హిప్పర్గా గ్రామానికి చెందిన అశోక్‌పాటిల్(58) కంగ్టి మండలంలోని తుర్కవడ్‌గాం గ్రామంలో బంధువుల పెళ్లి నిశ్చితార్థం కోసం ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. తిరుగుప్రయాణంలో వేగంగా డివైడర్‌ను ఢీ కొట్టి రోడ్డుపై పడ్డాడు. దీంతో తలకు తీవ్రగాయమై రక్తస్రావం కావడంతోపాటు అక్కడికక్కడే స్థలంలోనే మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఖేడ్ ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

రెండు కార్లు ఢీ : ఒకరి మృతి


మృతి చెందిన వెంకటేశ్

గజ్వేల్‌రూరల్: ఎదురెదురుగా రెండు కార్లు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా, నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని గజ్వేల్–పిడిచెడ్ మార్గంలో ఆదివారం చోటు చేసుకుంది. గజ్వేల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొల్గూరుకు చెందిన వెంకటేష్‌తో పాటు అతని బంధువులైన గొట్టిముక్కలకు చెందిన వెంకటేశ్ (40), నాని, సాయిగౌడ్‌లు గజ్వేల్ నుంచి కారులో కొల్గూరు వైపు వస్తున్నారు. బయ్యారం చౌరస్తా మీదుగా మేథిసీపూర్ వచ్చేందుకు బయలుదేరగా గజ్వేల్–పిడిచెడ్ మార్గంలో ఎదురెదురుగా వచ్చిన రెండు కార్లు ఢీకొన్నాయి. ఈ ఘటనలో గొట్టిముక్కలకు చెందిన వెంకటేష్ తీవ్ర గాయాలకు గురై మృతి చెందాడు. ప్రమాద విషయం అందుకున్న 108 సిబ్బంది క్షతగాత్రులను గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రామాయంపేటలో మరొకరు..


నవీన్ (ఫైల్)

రామాయంపేట(మెదక్): రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందాడు. ఎస్ఐ బాల్‌రాజ్ కథనం ప్రకారం.. పట్టణానికి చెందిన కాస నవీన్ (28) శనివారం రాత్రి రోడ్డుపై నడుచుకుంటు వెళ్తుండగా.. వెనుకనుంచి అతివేగంగా వచ్చిన బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నవీన్‌ను చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి.. అక్కడి నుంచి నుంచి సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్ఐ బాల్‌రాజ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

116 టన్నుల ఇసుక డంపులు స్వాధీనం

ముగ్గురిపై కేసు నమోదు


ఇసుక దంపును స్వాధీనం చేసుకున్న పోలీసులు

కొండపాక(గజ్వేల్): అక్రమంగా ఇసుకను డంపు చేసిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, కుకునూరుపల్లి పోలీసులు సంయుక్తంగా ఆదివారం దాడిచేసి మూడు చోట్ల అక్రమ డంపులను స్వాధీనం నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన కొండపాక మండలంలోని రవీంద్రనగర్ శివారులో రాజీవ్ రహదారికి సమీపాల్లో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ కథనం ప్రకారం.. రవీంద్రనగర్‌కు చెందిన తులశం పోశయ్య, కొమిరి మహేశ్, బోదాస్ నరేశ్ కొంతకాలంగా రాజీవ్ రహదారికి సమీపంలోని రహస్య ప్రదేశాలలో అక్రమంగా ఇసుకను డంపు చేస్తూ ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నారు. నమ్మదగిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులతో కలిసి మూడు చోట్ల దాడులు చేసి 116 టన్నుల ఇసుకను స్వాధీనం చేసుకున్నారు. అనుమతులు లేకుండా ఇసుకను, మట్టిని, మొరం, రేషన్ బియ్యాన్ని రవాణా చేసే వారిపై చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు. గ్రామాల్లో పేకాట, గంజాయి తదితర మత్తు పదార్థాలను సరఫరా చేస్తున్నట్లు గుర్తిస్తే తమకు సమాచారం అందించాలని కోరారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ


వివరాలు సేకరిస్తున్న క్లూస్ టీం

చేర్యాల(సిద్దిపేట): తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన ఘటన మండల పరిధిలోని ముస్త్యాలలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కేసిరెడ్డి బాల్‌రెడ్డి ఇంటికి తాళంవేసి కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌లో ఉంటున్న కుమారుడి వద్దకు వెళ్లారు. ఆదివారం ఉదయం ఇంటితాళం పగులగొట్టి ఉందన్న సమాచారం స్థానికుల ద్వారా తెలుసుకున్న ఆయన వచ్చి చూడగా ఇంట్లోని బీరువా తలుపులు తెరిచి ఉన్నాయి. గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారని గమనించిన ఆయన వెంటనే చేర్యాల పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరిస్తున్నారు. చోరీలో 5 గ్రాముల బంగారు ఉంగరం, రూ.10 వేల నగదు చోరీకి గురైనట్లు బాధితుడు తెలిపాడు. అదే గ్రామంలో మరో ఇంటి తాళం కూడా పగులగొట్టినట్లు సమాచారం. ఆ ఇంట్లో ఎలాంటి వస్తువులు చోరీకి గురికాకపోవడంతో ఫిర్యాదు చేయలేదు.

పోలీసులకు దొంగల అప్పగింత


పోలీసుల అదుపులో దొంగలు

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని పెద్ద గొట్టిముక్కుల శివారులోని భవ్యస్ ఫార్మా కంపెనీలో స్క్రాప్‌ను దొంగిలిస్తున్న వారిని కంపెనీ యజమాని పట్టుకొని పోలీసులకు అప్పగించారు. వివరాల్లోకి వెళ్తే.. శనివారం రాత్రి నలుగురు వ్యక్తులు కంపెనీలోకి చొరబడి స్క్రాప్, ఐరన్ రాడ్లు, కేబుల్ వైర్లను దొంగిలించి గోడపై నుంచి బయటకు వేస్తుండగా కంపెనీ యజమాని సీసీ కెమెరాలో గమనించాడు. వెంటనే సెక్యూరిటీని అప్రమత్తం చేశాడు. అనంతరం కంపెనీ వద్దకు చేరుకొని సిబ్బందితో కలిసి దొంగలను పట్టుకుని పోలీసులకు సమాచారం అందించారు. రెండు బైకులను సైతం అప్పగించారు. కొద్ది రోజులుగా కంపెనీ నడవడం లేదు. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదలకు చెందిన ముగ్గురు.. అందులో ఒకరు బీహార్‌కు చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. వీరు చుట్టుపక్కల గ్రామాల్లో వ్యవసాయ బోర్ల వద్ద స్టార్టర్లు కేబుల్ వైర్లు దొంగిలించారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కంపెనీ యజమాని ఫిర్యాదు మేరకు నలుగురిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మూర్ఛవ్యాధి భరించలేక వ్యక్తి ఆత్మహత్య


శేఖర్

ములుగు(గజ్వేల్): మూర్ఛవ్యాధి భరించలేక ఆత్మహత్యకు పాల్పడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. ఈ ఘటన ములుగు మండలం బండమైలారంలో చోటుచేసుకుంది. ఎస్ఐ విజయ్‌కుమార్ కథనం ప్రకారం.. బండమైలారం గ్రామానికి చెందిన తుడుం శేఖర్ కొంతకాలంగా మూర్ఛవ్యాధితో బాధపడుతుండేవాడు. దీంతో మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో 12న రాత్రి స్థానిక రేషన్ దుకాణం వద్ద శేఖర్ వాంతులు చేసుకుంటుండగా గ్రామస్తులు గమనించి అతడి భార్య లతకు తెలిపారు. వెంటనే ఆమె అక్కడికి చేరుకొని ప్రశ్నించగా మూర్ఛవ్యాధి, ఆరోగ్య సమస్యలను తట్టుకోలేక పురుగుల మందును తాగినట్లు శేఖర్ చెప్పాడు. దీంతో అతడిని వెంటనే గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆసుపత్రికి తీసుకెళ్లాల్సిందిగా అక్కడి వైద్యులు సూచించారు. గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో శేఖర్ శనివారం రాత్రి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వృద్ధుడు మృతి


గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం

కొండపాక(గజ్వేల్): గుర్తుతెలియని వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వెలికట్ట గ్రామ శివారులోని రైల్వే బ్రిడ్జి కింద ఆదివారం ఉదయం గుర్తు తెలియని వృద్ధుడు (65) అపస్మారక స్థితిలో ఉండగా స్థానికులు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారాన్ని అందించారు. పోలీసులు వృద్ధుడిని 108 అంబులెన్సులో సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని ఒంటిపై తెలుపు రంగు షర్టు, బూడిద రంగు ప్యాంట్ ధరించి తెల్లటి గడంతో ఉన్నాడన్నారు. మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రిలో భద్రపరిచినట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భయం వీడు.. విజయం తోడు


ఇంటర్ కళాశాలలో విద్యార్థులు

- ఇంటర్, పదో విద్యార్థులకు కౌన్సెలింగ్
- టెలీమానస్‌తో ఆత్మవిశ్వాసం నింపుతున్న నిపుణులు

సంగారెడ్డి క్రైమ్: విద్యార్థి జీవితంలో 10వ తరగతి, ఇంటర్ కీలక మలుపు. ప్రస్తుతం వార్షిక పరీక్షలకు విద్యార్థులు సిద్ధమవుతున్నారు. ఈ తరుణంలో కొంతమంది విద్యార్థులు ఒత్తిడికి లోనవుతున్నారు. పరీక్ష అంటే భయం, వచ్చిన మార్కులపై నిరాశ, చదివిన అంశాలు గుర్తుకు ఉండటం లేదని భావన, ఇతర విద్యార్థులతో పోలిస్తే తమ వెనుకబడి పోతున్నాం ఆలోచనలతో ఉంటున్నారు. ఈ క్రమంలో క్షణికావేశంలో తప్పుడు నిర్ణయాలు తీసుకుంటున్నారు. భయాన్ని పక్కన పెట్టి మీకు ఎంత తెలుసో అన్ని ప్రశ్నలకు సమాధానాలు రాయండి.. ఫెయిలైతే జీవితం అక్కడితో ఆగిపోదని.. ధైర్యంగా ప్రణాళికతో ముందుకు సాగితే విజయం మీ సొంతం అవుతుందని మానసిక వైద్య నిపుణులు విద్యార్థులకు సూచిస్తున్నారు.

తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలి

చదువు విషయంలో తరగతిలో ఉపాధ్యాయులు, ఇంట్లో తల్లిదండ్రులు పిల్లలను ప్రోత్సహించాలి. వార్షిక పరీక్షల సమయంలో తమ పిల్లలను చెడు ఆలోచనలకు దూరంగా ఉంచాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే. ప్రతీ విద్యార్థికి ఒకటి, రెండు సబ్జెక్ట్‌లపై ఇష్ట ముంటుంది వాటిని వేగంగా చదివేస్తే మిగిలిన వాటికి సమయం దొరుకుతుందని పిల్లలకు అర్థమయ్యే విధంగా టీచర్‌లు, తల్లిదండ్రులు వివరించాలి. సమాజంలోని మహనీయులను మార్గదర్శకత్వంగా తీసుకోవాలని తమ పిల్లల్లో స్ఫూర్తి నిప్పాలి.

సోషల్ మీడియాకు దూరంగా

పరీక్షలు పూర్తయేవరకు పిల్లలను సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలి. ఫోన్ లేదా కంప్యూటర్ అతి వినియోగాన్ని కట్టడి చేయాలి. పరీక్షల సమయంలో తల్లిదండ్రులు పిల్లల ముందు టీవీ గాని, ఫోన్ గాని ఎట్టి పరిస్థితుల్లో వాడరాదు. తమ పిల్లలకు ఇంట్లో చదువుకునే విధంగా ప్రశాంతమైన వాతావరణం నెలకొల్పాలి.

టెలీ మానస్ సేవలు

ఇంటర్, పదవ తరగతి విద్యార్థులకు టెలీ మానస్ సేవలు 24 గంటలు అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వం టెలీమానస్ పేరుతో టోల్ ఫ్రీ నంబర్లు 14416, 18008914416 అందుబాటులోకి తీసుకొచ్చారు. వార్షిక పరీక్షల సమయంలో ఈ నంబర్లకు విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఫోన్ చేస్తే మానసిక స్థైర్యాన్ని పెంపొందించి సూత్రాలు, పరీక్షల సమయంలో భయభ్రాంతులకు గురికాకుండా చిట్కాలను నిపుణులు ఫోన్‌లో గాని, తమ సెక్షన్‌లో వివరిస్తారు.

ఆత్మస్థైర్యమే తొలి గెలుపు



తల్లిదండ్రులు ఎట్టి పరిస్థితుల్లో ప్రథమ స్థానంలో నిలవాలంటూ పిల్లలపై ఒత్తిడి, లక్ష్యాన్ని నిర్దేశించకూడదు. ప్రశాంత వాతావరణంలో చదివే ఏర్పాటు చేయాలి. పరీక్షల సమయంలో ప్రతీ విద్యార్థి కనీసం ఆరుగంటల నుంచి ఎనిమిది గంటలు నిద్ర పోయేలా చూడాలి. పరీక్షల సమయంలో పిల్లలను జంక్ ఫుడ్‌కు దూరంగా ఉంచాలి, శాఖాహార భోజనం ఉండేలా చూడాలి. ఆత్మస్థైర్యమే విద్యార్థుల తొలి గెలుపు.

– డాక్టర్ విజయ్, మానసిక వైద్యులు సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రి